

"గాంధీ నగర్‌కు నడవ్వోయ్".
అని ఆజ్ఞాపించాను.

# రిక్షావాడు

శ్రీ ఆర్. రామనాధ రెడ్డి

రాత్రి పదికావచ్చింది. ఆకాశమంతా కారు చీకటితో నిండింది. నక్షత్రాల కాంతి తప్ప మరో కాంతి లేదు.

ఇండియన్ కేఫ్ నుంచి బయటికి వచ్చి వీధిలోనికి నడిచేను. నాకేం కనబడలేదు. నక్షత్రాలు మాత్రం జాలిగా మేఘాల చాటునుంచి తొంగిచూస్తున్నాయి. నాకు దూరంగా విద్యుద్దీపాలు మిణుకు మిణుకుమని కళ్లల్లో మెరుస్తున్నాయి.

ప్రశాంతంగా గాలి వీస్తోంది; మంచు కురుస్తోనే ఉంది.

నేను ఆలోచించేను;—యీ హోటళ్ల దగ్గ రిక్షావాళ్లు చాలా తక్కువగానూ. వాళ్ల ఆలోచనం అంతూ పంతూ ఉండదు. ఏ వేరం వాళ్లతో కుదరదు. ఇంకా కొంచెం ముందుకు పోతేనేగాని బళ్లు చవుగ్గా అమరవ్—...

నేనూ పొట్టనిండా అన్నం పట్టించేను. ఎలాగా నడవాలి. ఇంతలోనే బండి యెక్కితే ఊపిరి సలుపదు.

హోటలు ప్రదేశం నన్ను దరుస్తోంది వెళ్లిపొమ్మని. అక్కడ బైట పారేసిన అన్నం కోసం పందులూ మనుష్యులూ పెనుగులాడుతున్నారు. అట్టాంటి మనుషుల్ని మన దేశంలో యీ వరకు నేను చూడలేదు. వాళ్లను గూర్చి యే కథల్లో చదవనూలేదు. కాస్సేపటికి వాళ్ల ఆలోచన నాలోంచి పోయింది.

ఇక నేను నడుస్తున్నంతసేపూ మరో ఆలోచన తట్టలేదు. నా ఫుట్‌పాత్‌కీ కాలిజోడికీ యేర్పడే సంఘర్షణ తప్ప మరే శబ్దంగానూ నన్నాకర్షించలేదు. హోటలు దగ్గిర కుక్కల మొరుగుడులూ పందుల కీచులాటలూ—మనుష్యుల అదలింపులూ మాత్రం నా చెవిలో యింకా గింగురు మంటున్నాయి.

క్లాక్ టవరు...దగ్గరున్న రిక్షాల స్టాండుకి వచ్చేను. ఓ రిక్షా వాణ్ణి పిలిచి "గాంధీనగర్‌కు నడవ్వోయ్" అని ఆజ్ఞాపించాను.

# రిక్షావాడు

వాడికి పాతికేళ్లుంటాయి. బలంగాలేక నీరసంగా ఉన్నాడు. మధ్యమధ్య వెలుగుల్లో అతని రూపం నాకు కనిపించింది. నల్లని పొట్టు గడ్డం పెరిగిపోయి—దాని కొసలు—తన తలపాగాకి అతికించినట్లు నాకగపడింది.

బండి సమంగా పోతూ ఉంది.

"ఎంత టైమయిందండి మాష్టారుగారు?" అడిగేడతడు.

"పన్నెండు దాటి పోయిందే" అన్నాను.

వాడు కొంచెం నాగరికంగా పిలిచేడు—

"అయితే చలిగా ఉంది...కూడువేయవోయ్...... ఆఁ యిప్పుడు కొత్తగా ఉంది కొంచెం...ఊఁ కదిలావే... కుంటుతున్నావా...దొంగ వెధవా...నాకు అర్జంటుగా పని ఉంది. త్వరగా పోనివ్వు!!"

వాడు కొంచెం కదిలేడు. అడుగులు విసురుగా పడుతున్నాయి.

వాళ్లనలాగే అదలికించాలి. లేకపోతే మన మాట వినే వారుకారు.

వాడూ ఏదో చెప్పబోయాడు. నేను వినుపించుకో లేదు. అయినా యేంచెబుతాడో అనిపించి—

"ఏమిటి నీవు చెబుతుంది" అన్నాను.

"నాకు చలిగా ఉందండి...మంచుకు పిడచ కట్టుకు పోతున్నాను. నా శరీరం దానికి అలవాటు పళ్లేదు. నా తత్వానికి చలిగాలి పడదు. ఈ మంచులో తడిసి నా ప్రతీ అవయవం ఒణికిపోతోంది"—

"ఉహూ పాపం! అలవాటు పళ్లేదేఁ—అలవాటు పడాలి మరి. లేకపోతే నీపని యెట్లా. ఏపని చేసేవాడి కాపని అలవాటు కావాల."

"అవునులెండి—మీరు నిజమే చెప్పారు. మనిషనే వాడు ప్రతీదానికి అలవాటు పడొచ్చు. కాని యే శరీరమైనా దీనికి అలవాటుపడేలోపల ఓ యిరవై ముప్పై సార్లైనా గడ్డకట్టుకు పోతుంది"—

"నేను సుకుమారంగా బ్రతికినవాణ్ణి. చిన్నప్పటినుండి కష్టం బాధ తెలీకుండా పెంచారు మానాన్న అమ్మాను.

నేను పాడైపోయాను.

నన్ను వాళ్లే పాడుచేసారండి; నన్ను గారాబంగా పెంచారు.

ఈ విషయంలో వాళ్ళ ఆత్మలకి శాంతి కోర్తాను. కానైతే నన్ను పాడుచేసింది వాళ్లే.

నాకు జలుబు చేస్తుందని బయటికి పోనిచ్చేవారు కారు. నేనంటే వాళ్లకు చాల అనురాగం. నాకు యింట్లో అందమైన దుస్తులు తొడిగేవారు. నన్ను ఉత్తకాళ్లతో నడవ నిచ్చేవారుకారు. కాళ్లకు మేజోళ్లూ బస్ట్ బూట్సులూ తొడిగేవారు, మరీ గొప్పవాళ్లల్లాట్టు. మాది సామాన్య రైతు కుటుంబమైనా నన్ను మహారాజులా పెంచారు.

నాకెంతో చదువుకూడ చెప్పించారు. మా అమ్మ యెప్పుడైనా కోపమువచ్చి నన్ను కొడితే నాన్న చేరదీసి మా అమ్మను చీవాట్లు వేసేవాడండి. నాన్న కొడితే అమ్మ బుజ్జగించేది.

అప్పుడప్పుడు నాన్నకూడా పొలం వెళ్లితే అమ్మ నాకు మాడేసి ఊలుకోట్లు తొడిగేది. వాళ్లే నన్ను పాడు చేసారు"—

"ఐతే నీవు బాగా బ్రతికినవాడివన్నమాట" అన్నాను నేను.

"అవునండి మేం అంత ధనికులంకాదు. సామాన్య రైతులం. ఆ దేవుడి పుణ్యమంటూ యెపుడూ పస్తుండే యోగం.

మా నాన్నకి ఓ తమ్ముడున్నాడు. వాడికి పెళ్లకలేదు. రంగం వెళ్లి రెండెకరాల కొండ సంపాదించాడు. మాతాత అప్పటికున్నాడు. మేమంతా ఒక కుటుంబంగానే బ్రతికాము...ఒకే సంసారంగా...

వాళ్లంతా నన్ను వజ్రాలగని...బంగారం పంట అని పొగిడి ముద్దాడేవారు—

వాళ్లే నన్ను పాడుచేసారు...నేను పాడైపోయానండి" వస్తూన్న ఒగర్పుకు కొంతసేపుతాళి మళ్లీ అరంభించాడు.

# రిక్షావాడు

"ఇలా ఉంటుండగా రంగం చెడిపోయిందండి. మా నాన్న రంగాన్నించి చచ్చి నడిచి వచ్చాడు.

దేశంలో నే ఆసరమున్న రెండెకరాలతోపాటు మరో పదెకరాలు కౌలుతీసి మానాన్న, ఆయన తమ్ముడు సాగు ఆరంభించారు.

వ్యవసాయం చేస్తుండగా మానాన్న అనేక దెబ్బలు తిన్నాడు. ఎంత కష్టపడి పండించినా అది కౌలుకు సరిపోయేది. వ్యవసాయదారులపని మాచెడ్డ దుర్భరం బాబూ.

రానురాను మానాన్న యీనాందారుకు బకాయి పడ్డాడు. తర్వాత రెండు గాలివానలు వచ్చి కళ్లారా చూసిన పంటంతా నాశనం అయిపోయింది. మాకు ఋణాలు బాగా పెరిగిపోయాయి. ఇంటి చుట్టూరాగ అప్పులే.

మా స్వంత భూమి అమ్ముకున్నా అప్పు తీరిందికాదు. మా కోడెల మేకల మందంతా మా భూమితోపాటు యీనాందారుకు కలిసింది.

మరో దిక్కులేక మానాన్న మా చిన్నాన్న కూలి పనులకు పోయారు.

నేను ఓ పాలేరుక్రింద వెళ్లాను—అయితే మరి నాకా పనేం చాతనవును? నేను పాలేరు నౌతానని వాళ్లెప్పుడూ అనుకోలేదు.

వాళ్లు నన్ను పాడుచేసారు.

ఆ తర్వాత యిలా మారాను. మా బ్రతుకెవ్వరూ బ్రతకరు."

"అయితే మీ యీనాందారు మీకేం సాయం చేయలేదా?" నేను అడిగాను.

"హుఁ...ఆయన చేస్తాడూ! ఇద్దరు ముండల్ని పెంచుతున్నాడు—వాళ్లిద్దరికీ చెరో మేడానండి. వాడి కుక్కలు తినేతిండి మాకు లేదిప్పుడు.

ఆయన ప్రాణానికేం ఫరవాలేదు. అలా యెంతో భూమి ఆయనకు కలిసింది. ఆయన పుణ్యమా అంటూ మేమంతా బ్రతికి చెడ్డామండి—మీరాయన పేరు యెప్పుడూ వినలేదూ?"

"లేదు కొంచెం త్వరగా పోనియ్"

"ఆఁ పోనిస్తానండి. ఆయన మాకు ద్రోహం చేసాడండి—మమ్మల్ని సర్వనాశనం చేసాడు. కాలం ఎప్పుడూ తగ్గించి యెఱుగడు. పంటలు పండినా యెండినా అంతే—తీరని ద్రోహం కాదాండి.

లేకపోతే యిల్లాంటి చలిలో నేను చచ్చిపోదునా? నేను పుట్టిన ఊళ్లోనే హాయిగా సుఖంగా బ్రతికుందును.

ఇప్పుడు మా కుటుంబం అంతా చెల్లా చెదరై తలోదారి చూసుకున్నాం—దేవుడికేం దయలేదు. మాయీ బాధకంతకీ కారణమైన 'వాడిని' శిక్షించమని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను.

పోనీలే—దేవుని దయ వాడిమీదే ఉండ నివ్వండి. మనమే బాధపడదాం మరి"—

నాకు చాల జాలివేసింది అతని చరిత్ర విన్నాక. ఇలా యీ రిక్షావాళ్ల చరిత్రలు ఒక్కొక్కటీ తెలుసుకోవాలనిపించింది. తీరా తెలుసుకుంటే గుండె పగిలి చస్తాం.

"ఇదిగో ఆ యెడం వేపు డాబా యింటికి" అన్నాను నేను.

"చిత్తం!—నా కథంతా విన్నారు.. నా బాధంతా తెలుసుకున్నారు. ఒక్కణా డబ్బులు యెక్కువీయండి"

నేను అర్ధరూపాయి తీసి యిచ్చాను.

"మీరు కొంచెం యెక్కువ యీయాలి. నిన్నటినుంచి నా కన్నంలేదు. నీరసంచేసి బండి తిప్పలేను. నాల్గు రొట్టె ముక్కలా కొనుక్కోవాలి"

మరో పావలా యిచ్చాను.

అతని ముఖంలో హర్షాతిరేఖలు విచ్చాయి. అతడు రిక్షా తిప్పుకు పోయేడు.

చల్లగా వస్తోంది గాలి—పాపం! అతను యీ చలికి అలవాటు పళ్లేదు.

అతన్ని వాళ్లు పాడుచేసారు!!!